

జి.రజని

నీరెండ తగిలి కళ్ళని చురుక్కుమనిపించగానే మంచం మీద బద్ధకంగానే లేచి కూర్చున్నాడు సూర్యం. చుట్టూ కొత్తగా ఉన్న వాతావరణం మెల్లి మెల్లిగా మనసుకు అలవాటు కాసాగింది కొంచెం పాతబడిన ఇల్లు అది. పెరట్లో గిలకబావి నందివర్ధనం పూలచెట్లు. తెల్లని ముగ్గులతో మెరిసి పోతున్న నడవా దూరంగా పశువుల పాక ఉండి ఉండి అంబా అన్న అరుపులు.

తులసికోటలో నీళ్ళు పోసి దణ్ణం పెడుతున్న కృష్ణమూర్తి భార్య పట్టుచీర కొంగు చల్లగాలికి రెపరెపలాడుతోంది.

ఆ ప్రభాత వేళ సౌందర్యం సూర్యం నిద్రమత్తుని క్షణంలో వదిల్చి పారేసింది. ఓ విధమైన తన్మయత్వంతో గుండె నిండిపోయింది. నిజమే ఎక్కడో నాగపూర్‌లో నిత్యం వాహనాల రణగొణధ్వనులు. మనిషికీ మనిషికీ పొంతనలేని కృత్రిమ తత్వాలు తెచ్చుకోలు నవ్వులకి అలవాటు పడిపోయిన అతని ప్రాణాలకి ఈ పల్లెటూరి గాలి కన్నతల్లి ప్రేమలా చల్లగా మెత్తగా తాకుతూ చిన్ననాటి స్మృతుల్ని ఒక్కసారి లేపి తట్టి గిలిగింతలు పెట్టింది.

ఈ ఊళ్ళో ప్రతి అణువు తనకి పరిచయమే. అడుగు పెట్టని గడపే లేదు. స్నేహితులు కాని వారేలేర.

కృష్ణమూర్తి తను గోలీకాయలాడుకున్న నిక్కరు రోజులు జ్ఞాపకం వచ్చి అతని పెదవులపై చిన్నగా చిరునవ్వు మెరిసింది.

ఆ క్షణంలో తనో పెద్ద ఫర్మ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరునన్న సంగతి మర్చిపోయాడు. ఓ అందాల భామకి భర్తననీ, ముచ్చటయిన ఇద్దరు పిల్లల తండ్రిననీ అతని స్పృహకే రాలేదు.

కృష్ణమూర్తి వచ్చి రెండు మూడుసార్లు పలకరించితే గాని ఈ లోకంలోకి రాలేకపోయాడు.

"రాత్రి బాగా నిద్రపట్టిందా?" అతని ప్రశ్నకి తల ఊపాడు సూర్యం.

కృష్ణమూర్తి అక్కడే స్కూలులో టీచరుగా పనిచేస్తున్నాడు. ఇంత హాయి అయిన పరిసరాలలో ఉన్న ఊళ్ళోనే స్థిరపడిపోయాడు. అదృష్టవంతుడు.

బ్రష్ తీసుకుని వాకిట్లోకి వచ్చాడు. ముఖం కడుక్కునేందుకు నీళ్ళు సిద్ధంగా పెట్టింది కృష్ణమూర్తి భార్య. నడుస్తుంటే ఆమె పాదాల వెండి మట్టెలు పట్టాలు లయగా శబ్దం చేస్తున్నాయి.

పల్లెటూరి ముగ్ధ అందమంతా ఆ సవ్వడిలో వినిపించి నవ్వుకున్నాడు సూర్యం.

ఆ క్షణంలో అతనింకేమి ఆలోచించలేదు. అంతరంగంలో మధుర గానాలు మారుమ్రోగుతున్న వేళ జీవితం అక్కడే ఆగిపోతే బాగుండుననిపించే అపురూపమైన ఘడియలు అతనికా తన్మయత్వాన్ని, వదలాలనిపించలేదు.

ఒక విధమైన తన్మయత్వంలో మునిగిపోయిన సూర్యం ఒక్కసారి తలెత్తి కనిపించిన దృశ్యాన్ని చూసి రక్తం గడ్డ కట్టినట్టయి బిగుసుకు పోయాడు. అతని గుండె కొంచెం సేపు కొట్టుకోవడం మానింది

ఆ ఊరికి ఉన్న ఒకే ఒక మంచినీటి చెరువు కృష్ణమూర్తి ఇంటి ఎదురుగానే ఉంది. అక్కడ బిందె ముంచుకుని నీళ్ళు తెచ్చుకుంటున్న స్త్రీ అతి సామాన్యంగా ఉంది. వెలిసిపోయిన నేత చీర, నిర్లక్ష్యంగా వదిలేసిన పీపంతా పరచుకున్న పొడవైన తలకట్టు. నుదుట కనీ కనిపించకుండా చిన్న కుంకుమబొట్టు.

ఏ భావమూ లేకుండా నిశ్చలంగా నిర్వికారంగా ఉన్న విశాలమైన నేత్రాలు అతి మామూలుగా ఉన్న ఆమెలో అద్భుతమైన సౌందర్యం సృష్టికర్త పాలరాతి బొమ్మను చేసి ప్రాణం పోసినట్లు చప్పున తల తిప్పుకున్నాడు సూర్యం.

ఆమెను చూడగానే సుందరమైన లోకంలో నుంచి అధః పాతాళానికి జారిపడ్డట్లు ఫీలయ్యాడు పాల కుండలో విషం చిందినట్లుగా చేదుగా అనిపించింది.

అరుంధతి వెనక నీళ్ళు తెచ్చుకుంటున్న అమ్మలక్కల మాటలు బాహాటంగానే అతని చెవిన పడుతున్నాయి.

"ఈ పాపిష్టి కళ్ళతో ఎన్ని విచిత్రాలు చూడవలసి వస్తోందమ్మాయ్! ఎంత బరితెగించిన మనిషి కాకపోతే విచ్చలవిడిగా చెరువుకొస్తుంది! ఈ ఒక్క పూటా నీళ్ళు తెచ్చుకోకపోతే కొంపలేం మునిగాయి. అవతల చెట్టంత కొడుకు సవతి పిల్లాడే అనుకో ఊళ్ళోకి వచ్చి మొహం చెల్లక అయినవాళ్ళింట్లో దిగకుండా స్నేహితుడింట్లో మకాం పెట్టాడా ఇంకో మనిషయితే సిగ్గుతో ప్రాణం పోయి గడప దాటి కాలు ఇవతల పెడుతుందా! తగుదునమ్మా అని ఇలా వీధిన పడి తిరగడమే ఆశ్చర్యం రోజూ ఈ వగలు వయ్యారాలు మనం చూస్తూనే ఉన్నామనుకో ఏమైనా సంప్రదాయపు కుటుంబాల్లో ఉన్న ప్రాణాలం. ఇలాంటి మోరకలి చూస్తుంటే ఇహ అన్నం సయిస్తుందా! పరాయి వాళ్ళం మనమే ఇంత మధనపడిపోతున్నాం ఆ అబ్బాయి ఎలా తట్టుకున్నాడో పాపం అందరూ తెలిసినవాళ్ళేనాయె. ఏ ముఖం పెట్టుకుని ఎవర్ని పలకరిస్తాడు! ఎవరింటికి సంతోషంగా వెళ్ళగలడు!"

రామాయమ్మగారి మాటలు ప్రవాహంగా సాగిపోతుంటే ఈతరాక కొట్టుకుంటున్న చిన్న పిల్లాడిలా ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు సూర్యం పంక అలవోకగా చూసి పెదవి విరుచుకుంది. కరణంగారి కోడలు

"అవునత్తయ్యా. ఆ అబ్బాయి పడే మనోవ్యధ మనం తీర్చేదికాదు ఓదార్చవలసిన విషయం అంతకంటే కాదు. అరుంధతికి మాయ రోగం వచ్చిందనుకోవాలి లేకపోతే ఇలాంటి పాడు బుద్ధులెందుకు పుడతాయి! వాళ్ళ మామగారు పౌరోహిత్యం చేసినట్టు చేశాడు. పెనిమిటి వేదాలు చదివాడు. వాళ్ళ నాన్న యజ్ఞం చేసినట్టు విన్నాం రెండు వంశాలకి అప్రదిష్ట తెచ్చి పెట్టింది అలా బతకడం కన్నా చెరువులో పడి చావడం నయంకాదూ?" ఆవిడ గొంతులో స్పష్టంగా

ధ్వనిస్తున్న ఈసడింపు నాలుగడుగుల దూరంలో నడుస్తున్న అరుంధతి పిన్ని చెవిన పడటం లేదా సూర్యం ఆశ్చర్యానికి అంతులేదు. ఆ ఛీత్కారాలు వెటకారాలు తనవి కానట్టే నిర్వేదంగా ఇంటికి అరుంధతి నడచిపోతుంటే నిర్విణ్ణుడై నిలబడి పోయాడు సూర్యం. ఆమె నిబ్బరానికి లోలోపల మెచ్చుకోలేకుండా ఉండలేక పోయాడు కానీ మళ్ళీ మనసు మేల్కొలిపింది. నువ్వు ఊళ్లో తలెత్తుకో లేని పాడు పని చేసింది. నువ్వు పుట్టిన వంశానికే కళంకం తెచ్చింది. నీ తండ్రిపోగానే ఊళ్లో భూస్వామి నాయుడితో సంబంధం పెట్టుకుంది. పరోక్షంగా నిన్ను నవ్వులపాలు చేసినట్టు కాదా. ఇక్కడ మిగిలిన కాస్త పొలం అమ్ముకుని ఇక ఈ ఊరితో ఋణం తీర్చేసుకోవాలని వచ్చావు. అదేదో పూర్తి చేసుకుని తిరుగు బస్సెక్కు. అనవసరంగా అరుంధతి పిన్ని నీడ చూసినప్పటికీ నీ మనసు విపరీతంగా పాడవటం ఖాయం. ఆ ఇంటి చాయలకు పోబోకు. "తీవ్రంగా తన్ను తాను హెచ్చరించుకున్నాడు సూర్యం

గబగబా వేడినీళ్ళ స్నానం చేశాడు. కృష్ణమూర్తి ఆ పూట స్కూలుకి సెలవు పెట్టాడు. ఇద్దరూ చిన్ననాటి సంగతులే తరచి తరచి చెప్పుకుంటూ భోజనం చేశారు కృష్ణమూర్తి ఎన్నో సంగతులు ఈ పదేళ్లలో ఊళ్లో వచ్చిన మార్పులు కథలు కథలుగా చెబుతున్నాడు. పరధ్యానంగా ఊ కొడుతూ వింటున్నాడు సూర్యం కానీ ఒక్క విషయం అతని దృష్టిని దాటి పోలేదు కృష్ణమూర్తి పొరపాటున కూడా అతని కుటుంబ విషయాలు ముఖ్యంగా అరుంధతి గురించి సంభాషణలలోకి రాకుండా జాగ్రత్త పడుతున్నాడు. ఆమెను గురించి ఎన్నో తెలుసుకోవాలనుంది. ఉబుకుతున్న కుతూహలాన్ని లోలోపల అణుచుకుని ఊరుకున్నాడు సూర్యం. తనక తానుగా బయటపడటం అతనిక ఇష్టంలేదు. పైగా కృష్ణమూర్తి నోట ఆ చేదు నిజాలు వింటే ఏమైపోతానో అన్న భయం కలిగింది. అసలు రామాయమ్మగారు చెప్పినట్టే తలెత్తుకోవడం కష్టం

మనిషి జీవిత పరిధుల్ని కనీస మర్యాదల్ని చదువుకోక పోయినా ఆవిడ ఒక్క మాటలో సులభంగా తేల్చి చెప్పగలిగింది నిజంగా ఇప్పుడు తన పరిస్థితి అలాగే ఉంది ఆ నాలుగెకరాల పొలం అమ్మాలంటే నలుగురి సాయం తప్పనిసరి, లేకపోతే మంచి ధర రావడం కష్టమే అయినకాడిక అమ్ముకుంటే కొన్ని వేలు నష్టపోక తప్పదు ఏమైనా ఊళ్లో అందరి ముందుకు పోయి ఆ అవమానం భరించే కంటే ఏదో ఓ రేటుక ఇక్కడ కృష్ణమూర్తి ఇంట్లోనే అమ్ముకుని వెళ్లడం మంచిది అన్న నిర్ణయానికి వచ్చాడు సూర్యం

మెరుపులా ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఆ పొలం పక్కనే కృష్ణమూర్తి తోట ఉంది. ఇతనికో ఇస్తే సరిపోతుంది. పదివేలు వార అయినా



ఫరవాలేదు ఎంతైనా ప్రాణ స్నేహితుడు. అతని గుండెలో అభిమానం పొంగింది

కృష్ణమూర్తి భుజం మీద స్నేహపూర్వకంగా చేయి వేశాడు. "ఒరేయ్ కృష్ణా ఈ పరిస్థితిలో నేను పొలం " బేరానికంటూ తిరగలేను నువ్వే తీసుకోరాదూ"

కృష్ణమూర్తి చాలా సేపు మాట్లాడలేదు. చివరకి "నేనా! నీ పొలం రేటు ఇప్పుడు అరవై వేలకి తక్కువ ఉండదు. అంత ఇచ్చుకోలేను. అయినా ఇప్పుడు కొత్తగా భూమి కొనాలన్న ఉద్దేశం కూడా లేదు. నువ్వు శ్రమపడ నవసరం లేకుండా ఆ వ్యవహారం నేను సెటిల్ చేసి పెడతాను" మంచం వాల్చుకుని దిండు వేసుకుంటూ అన్నాడు. సూర్యానికెంతో రిలీఫ్ దొరికింది, కృతజ్ఞతగా చూశాడు.

"రక్షించావు. అసలీ పని ఓ కొలిక్కి వస్తుందా అని భయపడ్డాను. నువ్వుండగా ఇంక ఆ విషయం ఆలోచించనక్కరలేదు." కళ్ళు మూసుకుని పడుకున్నాడు. అతని ఎదలో సుళ్ళు తిరుగుతున్న బాధా తరంగాలని గమనిస్తూనే ఉన్నాడు కృష్ణమూర్తి.

తప్పించుకుని ముఖం చాటు చేసుకుంటూ ఆవేదనని దూరం చేసుకోవాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాడు సూర్యం. అతనిదసలే సున్నిత హృదయం. బస్సు దిగుతూనే మునసబు పాలేరు చెప్పనే చెప్పాడు. ఇదివరకెప్పుడో ఉత్తరాలలో బంధువులు ప్రస్తావిస్తే నిజమో కాదో అని పట్టించుకోక ఊరుకున్నాడు. ఇప్పుడు లోకం కోడై కూయడమంటే ఏమిటో తెలిసింది.

నిజానిక అరుంధతి కథ ఎప్పుడో పాతబడిపోయింది. కాని సూర్యం తలవని తలంపుగా అకస్మాత్తుగా రావడంతో తమకంతా తెలుసు నన్నట్లు పదేపదే అతని ముందు ఆ విషయం ఎత్తి మనసును ఈటెల్లాంటి మాటలతో చిత్రవధ చేస్తున్నారు

మధ్యాహ్నం పొలం లెక్కలు వేయడానికి మునసబు గారింటికి ఇద్దరూ వెళ్లారు

పడకుర్చీలో తీరిగ్గా పడుకున్న శేషాచలం గారపట్టిన పళ్లను బయటికి పెట్టి పెద్దగా నవ్వుతూ పలకరిస్తుంటే తల వంచేసుకున్నాడు సూర్యం.

"ఏమోయ్! ఇన్నాళ్లకి వూర్లోకి అడుగు పెట్టావు. మేమందరం గుర్తున్నామా' పోనీలే పెద్ద చదువులు చదువుకున్నావు మంచి ఉద్యోగస్థుడవి అయ్యావు మీ నాన్న పోగానే మేనమామ ఊరెళ్లినందుకు మేలే జరిగింది ఇక్కడే వుంటే నీ భవిష్యత్తంతా ఏమయ్యేదో, ఆ అరుంధతమ్మ, ఛ. ఛ. చెప్పుకుంటే సిగ్గు చేటయ్యా ఆ నాయుడు తగులుకుంచి వాడేమో దాని ఇంటిక కాపలనిపన్ని పాలేళ్ల చేత పంపిస్తాడు ఆ ఇల్లంతా ఇప్పుడు నాయుడి అజమాయిషిలోనే ఉందనుకో మీ ఎన్నిని చూసి బుగ్గలు నొక్కుకొని ఆడదిలేదు. తల దించుకొని

మగాడు లేడు. ఉన్నత వంశంలో పుట్టి ఇదేం బుద్ధయ్యా. ఇద్దరు పిల్లల్ని ఆ మాత్రం పోషించుకోలేక పోతుందా. ఏదో మాలాంటి నాలుగిళ్లలో పని పాటు చేసుకుంటే బతుకు గడిచిపోదూ - అందుకు కులం కానివాడితో సంబందం పెట్టుకోవాలా!"

ఆయన జాలి కురిపిస్తుంటే పిడి బాకులు పెట్టి వళ్లంతా తూట్లు పొడిచినట్లుంది సూర్యానిక. సిగ్గుతో పిన్ని మీద వల్లమాలిన కోపంతో అతని వదనం ఎర్రగా కమిలిపోయింది.

అది సరేలెండి. మనవాడు వచ్చిన విషయం.... అంటూ మాట తప్పించబోయాడు కృష్ణమూర్తి.

"నువ్వుండవోయ్. చాలా రోజులకి వచ్చాడు! అతనికి అన్ని సంగతులు ఇక్కడ జరుగుతున్న భాగోతం అంతా చెప్పొద్దంటావా. నాయనా సూర్యం. మీపిన్ని వ్యవహారం నలుగురికీ తల వంపులుగా ఉందంటే అందులో అబద్ధమేముంది. మర్యాదగల కుటుంబాల వాళ్ళ మంతా ఏమైపోవాలి మాకూ ఆడపిల్లలున్నారు. ఇలాంటి పోకిరి బుద్ధులు వాళ్ళు నేర్చుకునే ప్రమాదముంది. అందుకని కాస్త చెప్పవయ్యా, ఎలాగూ వచ్చావు. మీ పిన్నికి కాస్త గడ్డిపెట్టు. సవతి కొడుకుతే కావచ్చు. కానీ బంధుత్వం దగ్గరేగా" ఆయన వాగ్ధోరణి ఆగేటట్టు లేదు. స్నేహితుడి ముఖాన.

కత్తి వాటుకి నెత్తురు చుక్క లేకపోవడం గ్రహించాడు కృష్ణమూర్తి

"తర్వాత వస్తామండి" సెలవు తీసుకుని సూర్యాన్ని రెక్క పట్టుకుని బయటికి తీసుకువచ్చాడు.

దారిలో అతినిశబ్దంగా ఉన్నాడు సూర్యం కానీ అతని గుండెలో అగ్నిపర్వతం రగులుతోంది అదురుతున్న అతని ముక్కుపుటాల్లోంచి వేడి సెగలు చిమ్ముతున్నాయి. కళ్లలో నీటి తడి. ఆ స్థితిలో అతన్ని చూసి కృష్ణమూర్తి పెదవి విప్పడానికి సాహసంచలేకపోయాడు. ఇద్దరూ మౌనంగా ఇంటికి తిరిగి వచ్చాడు. వరండాపై ఉన్న కుర్చీలో సూర్యం వాలిపోతే కృష్ణమూర్తి లోపలి కెళ్ళాడు

తలపై చేతులుంచుకుని అలాగే కూర్చున్నాడు సూర్యం వెంటనే ప్రయాణమై ఊరికి బయలు దేరిపోతే బాగానే ఉండునని పదేపదే అను కుంటున్నాడు

వీధి గుమ్మానికి ఎదురుగా మట్టిరోడ్డు ఓ పక్కగా గోలీలాడుకుంటున్నారు ఇద్దరు పిల్లలు.

తమ్ముడ్ని పిలవడానికని వచ్చింది కాబోలు ఆరేళ్ల పిల్ల ఆ సంగతి మర్చిపోయి ఆట ధ్యాసలో పడిపోయింది. ఎర్ర చుక్కల పరికిణీ చిన్న నోరు చురుకైన చూపులు వాళ్ళు అరుంధతి పిన్నిపిల్లలు తన రక్తం పంచుకు పుట్టిన చెల్లెలు తమ్ముడు అని గుర్తించగానే అతని ఒంట్లో రక్తం ఒక్కసారిగా పొంగింది. ఎవరిక కనిపించకుండా ఎవరితో మాట్లాడకుండా అక్కణ్నుంచి పారిపోవాలన్న

కోర్కె బలంగా కలిగింది.

"బాబూ! నేను సాంబయ్యని గుర్తున్నాను" తలపాగా కట్టుకుని అతివినయంగా నిలబడిన మనిషి ఇదివరకు తమ ఇంట్లో పాలేరుగా పని చేశాడు.

గుర్తుండకేం ఎలా మర్చిపోతాడు. సాంబయ్య భుజాలపై ఆడుకునే వాడు. వడదెబ్బ కొట్టిన వాడికి చల్లని చిరుగాలి సోకినట్టు ప్రాణం లేచొచ్చింది.

"బాగున్నారా" అని అతని కుటుంబ క్షేమ సమాచారాలడిగాడు.

"ఏం చెప్పమంటావులే బాబూ. మా ఇంటిది కాలం చేసింది. అప్పట్నుంచి కోడలు గంజినీళ్ళు కూడా పోయనంటది. పెద్ద వయసొచ్చినా కూలి చేసుకోక తప్పడం లేదు" అని కూలబడ్డాడు.

సూర్యం ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో ఎంత మంది పిల్లలో అతని భార్య ఎలా ఉంటుందో అన్ని వివరాలు కనుక్కున్నాడు.

అయితే ఇక్కడ పొలం అమ్ముకుని ఊరితో సంబంధం పూర్తిగా తెంచేసుకుంటారన్నమాట. ఇంక మళ్ళా వస్తారో రారో. సాంబయ్య దిగులు పడుతుంటె సూర్యం అతి మెల్లగా అన్నాడు.

"ఇక రాకూడదనే నా ఉద్దేశం సాంబయ్యా" అతడు ఉలిక్కపడినట్లుగా చూశాడు.

"ఏవిటి....." ఏదో గొణుక్కుంటున్నట్టు

"ఊరివాళ్ళ మాటలు మీదాక వచ్చాయన్న మాట' అన్నాడు తల నిమురుకుని.

ఎందుకు రావు సాంబయ్యా, మానాన్న ఎంత పరువుగా బ్రతికాడో ఆ ఇంటిని నమ్ముకుని పనిచేశావు నీకు తెలుసు. మాది ఎంత సదాచార వంశమో ఇక్కడ ప్రతిగడపకి తెలుసు. నేనిప్పుడు తలెత్తుకోలేని స్థితిలో ఉన్నానంటే కారణం నానోటితో చెప్పనక్కరలేదు. నేనిక్కడ గంటసేపు ఉండలేక పోతున్నాను. సిగ్గుతో అవమానంతో ప్రాణం చచ్చిపోతోంది. ఒక్కటే సందేహం . ఇన్ని ఛీత్కారాలు వెక్కిరింపుల మధ్య ఆవిడ ఎలా ఉండగలుగుతోందా– అని"

పిల్లల్ని పిలవడానికి అటు వేపుగా వచ్చిన అరుంధతిని చూసి కావాలనే చివరి మాట బిగ్గరగా అన్నాడు సూర్యం

"ఆడదానికి ప్రాణంకన్నా విలువైనది శీలం కాదంటావా, అదీ లేనప్పుడు బ్రతికి ప్రయోజన మేముంది?" అందులో ధ్వనించిన ఆగ్రహానికి సాంబయ్య కొద్దిగా బెదిరాడు.

సూర్యం మాట వినిపించి కాబోలు ఒక్కసారి వెనక్కి నిర్వేదంగా . చూసి పిల్లల్ని తీసుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది అరుంధతి. ఆ చూపుల్లో ఎటువంటి భావం స్ఫురించ లేదు సూర్యానికి పైగా ఆవిడ తన ఉనికిని ఏమాత్రం ఖాతరు చేసినట్టుగా లేదు. తన ఇంట్లో సకల మర్యాదలు అందుకోవలసిన స్థానంలో ఉండి ఇలా దిక్కు లేనివాడిలా స్నేహితుని పంచన తల దాచుకున్నాడు. కనీసం ఆ బాధ కూడా ఆమె వదనంలో ప్రతి ఫలించలేదు.

రోజూ కనిపించే సాంబయ్య వైపు ఎలా చూసిందో తనవైపు అదే విధంగా నిరాసక్తంగా......

అందులో అర్థం సూర్యానికి అంతుపట్టలేదు. దూషణలకి తిరస్కారాలకి అతీతంగా అతి ప్రశాంతంగా ఉంది ఆమె ముఖం.

లోకమంతా కట్టగట్టుకుని నిందించినా చలించదేమో.

తండ్రి ఆమెను వివాహం చేసుకున్న తర్వాత ఆమెతో కలసి రెండు మూడు రోజులు ఆ ఇంట్లో ఉన్నాడతను అంతే.

ఇద్దరిదీ దాదాపు ఒకటే వయస్సు కావడం ఆవిడను చూడాలంటే బిడియపడే వాడు. దానికి తోడు అరుంధతి ఎప్పుడు తలుపు చాటునే ఉండేది.

నేత చీర కొంగు పొడుగాటి వాలుజడ ఆమె ఉందనడానికి సంకేతాలు. పెదవి విప్పి ఆమె మాట్లాడటం అతను వినలేదు. సాధారణంగా ఏ స్త్రీలోను కనిపించని విశిష్టత అరుంధతి పిన్నిలో ఉంది. ఆమె అంటే ఆరాధనా భావం అతనిలో చోటు చేసుకుంది.

ఇప్పుడో దానిస్థానే జుగుప్స లోకంలో అందరూ ఆలోచించే రీతిలో ఆమె పై రాళ్ళు రువ్వే ప్రవృతిలో నే అతడు పయనిస్తున్నాడు.

పొలం వ్యవహారం దాదాపు సెటిల్లై పోయినట్టే. ముందు కాసేపు లౌక్యంగా బేరాలు సాగించినా చివరికి నలభై వేలకి ఒప్పుకున్నాడు. మునసబు కొడుకు . సగానికి సగం నష్టం వస్తున్నా భరించాడు సూర్యం.

రాత కోతల సమయంలో మునసబు కొడుకు అలవోకగా అన్నమాట ముల్లులా అతని మనసుని గాయపర్చింది.

మీనాన్నకి జబ్బు చేసినప్పుడు కొంత పొలం అమ్మారు చూశాలే. అరుంధతమ్మ తన వంతు అమ్మి భర్తకి వైద్యం చేయించింది కానీ నీ ఆస్తిలో కానీ ముట్టుకో లేదోయ్ తమ్ముడూ. అప్పుడావిడ కాస్తంత తెలివి తేటలు చూపించి ఉంటే నువ్వు అమ్మడానికి నీ వాటా అసలు మిగలక పోను "

ఎందుకని అలా చేసిందో ఉమ్మడిగా ఉన్న భూమి అమ్మితే మాత్రం కాదనడానికి తన తరపున ఎవరున్నారు. కేవలం ఆవిడ వంతు వచ్చిన ఆస్తితో నే తండ్రికి వైద్యం చేయించిందంటే. ఏమో ఎంతవరకు నిజమో . ఆ విషయం అంతటితో వదిలేసి ఊరుకున్నాడు.

ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు.

సాయంత్రం ఏరువంక బయలు దేరారు స్నేహితులిద్దరూ.

సూర్యం ఆ ఇంటి గుమ్మం దాటబోతూ ఎందుకో ఆగిపోయి పరిశీలనగా చూశాడు. ఆ ఇంట్లో తిరుగాడిన రోజులు మనసుని ఒక్క ఊపు ఊపగా భారంగా నిట్టూర్చాడు.

వీధిలో సన్న జాజి పందిరి గేటుదాటి లోపలికి వెడితే దూరంగా పెరటివైపు మెట్ల మీద కూర్చుని బియ్యం ఏరుకుంటోంది. అరుంధతి.

చటుక్కున తలవంచుకుని గబగబా నడిచాడు.

ఏటి వడ్డున కూర్చున్నారు.

కృష్ణమూర్తి చాలాసేపు మాట్లాడ లేదు. అతనేదో తీవ్రంగా ఆలోచిస్తున్న ధోరణి కనపడింది. ఎంతో ముఖ్యమైన విషయమైతే తప్ప అతను అంత సీరియస్‌గా ఉండడు.

అయినా ఇక చెప్పేదేముంది. కృష్ణమూర్తి బహుశ మరోసారి గుర్తు చేస్తాడు వెంకట్రాయ నాయుడుతో పిన్ని రాసలీలలు వర్ణిస్తాడు.


సూర్యం అన్నిటికి సిద్ధపడినట్టే గడ్డి పరకలు పెరుకుతున్నాడు.

"సూర్యం" హఠాత్తుగా కృష్ణమూర్తి గొంతు పలికింది.

"మీ పిన్నితో నీకు ఎంత పరిచయం ఉంది?"

"ఏమో ఓ నాలుగు రోజులు అక్కడ ఆ ఇంట్లో ఉన్నానేమో, అప్పుడావిడ పన్నెత్తి పలకరించిందే లేదు" గుర్తు చేసుకుంటూ అన్నాడు.

"అవునా. అరుంధతి నాకు ఎన్నేళ్ళుగా



# సప్త రాగాలలో రామాయణాన్ని నిక్షిప్తం చేసిన స్వాతి తిరునాళ్

కీర్తనల రచనలో మణిప్రవాళ సాహిత్యాన్ని ప్రవేశ పెట్టిన ఘనత శ్రీ స్వాతి తిరునాళ్ మహారాజాది.

ఈయన రామాయణాన్ని సప్త రాగాలలో, పొందుపరిచి రచించారు. సంస్కృతాంధ్ర మళయాళ భాషలు కలిసిన ఈ రాగమాలిక చిట్టస్వరాలతో కూడి ఎంతో పేరుగాంచింది.

అయితే స్వాతి తిరునాళ్ మహారాజుకి, ఆయన వచనకూ బహుళ ప్రజాదరణ లభింపజేసిన గాయని శ్రీమతి ఎం. ఎస్. సుబ్బులక్ష్మి. రసజ్ఞులు చాలామంది ఈ ఎల్. పి.ని విని ఉండవచ్చును.

ఈయన గొప్ప కళాపోషకుడు. నాట్యాచార్యులనూ, హిందూస్థానీ, కర్నాటక విద్వాంసులనూ, శిల్పులనూ ఈయన ఆదరించారు. ఈయన ఆయుర్దాయం ముప్పయి నాలుగు సంవత్సరాలు (1813– 1847). వీరు పరిపాలించినది (తిరువాన్కూరు 1829 నుండి 1847) కొద్ది సంవత్సరాలు. ఆ కాలంలో ఈయన ఆస్థానం కవిపండిత గాయకులతో కలకలలాడుతూ ఉండేది. ఆయన మాతృభాషలో (మళయాళం) ఎక్కువ రచించినా, సంస్కృతంలోనూ, తెలుగులోనూ కూడా అనేక రచనలు చేశారు.

ఈయన ఇలవేల్పు పద్మనాభస్వామి. కమలనాభ, పద్మనాభ అన్న ముద్రతో రచనలు సాగాయి. సంస్కృతంలో హరికథలు కూడా రచించారు.

జయదేవుని బాణిని కొంత అనుసరించి, పద్మనాభస్వామిపై రచనలు చేశారు.

జన్మతః అన్యభాషకు చెందినా, అనేక దేవతామూర్తులను వర్ణించినా, రామాయణాన్ని ఐదు రాగాలలో క్లుప్తంగా మనోరంజకంగా రచించారు. రామాయణంలో చివరగా మధ్యమావతిలో కలితవర సేతుబంధం, ఇలతపమపి బృందదళం, అతిక్రూర దశకంఠ, విదారం అతిధీరం" అనే చక్కని ప్రాసతో రచించారు. వాగ్గేయకారుడే గాక లక్షణగ్రంధకర్త కూడా. గేయములలో యమకములు, ఆదిమధ్యానుప్రాసలు విస్తరణ చేస్తూ వ్రాశారు.

నాట్యానికి అనువుగా పదవర్ణాలు వ్రాశారు. ఈనాడు నాట్యం నేర్చేవారు ఎక్కువగా ఉన్నారు. అయితే పదవర్ణాన్ని అభినయిస్తేనే ప్రజ్ఞ కనబడుతుంది. భరతాచార్యులైన వడివేలును హెచ్చువే తనమిచ్చి, ఆయన సలహా సంప్రదింపులతో వర్ణములు రచించి నాట్యకళకు దోహదం చేశారు. జీవించినది కొద్ది కాలమైన హంసలా జీవించిన ధన్యజీవి.

–కె. నాగేశ్వరి

## అమ్మ

తెలుసో చెప్పమంటావా. అయిదేళ్ళ పిల్లగా ఉన్నప్పట్నించీ ఆమెను నేను ఎరుగుదును. మా అమ్మమ్మగారి ఊరేగా వాళ్ళది. వాళ్ళ నాన్న పెద్ద పండితుడు. పట్టుబట్టి తండ్రి దగ్గర వేదం నేర్చుకుంది. సంస్కృతంలో శ్లోకాలు గడగడా చెప్పగలదు. పురాణాలన్నీ పుక్కిట పట్టింది. పేదరికం రెండో సంబంధాన్ని ముడిపెట్టించినా కిమ్మనలేదు. పెళ్ళయింది మొదలు ఏనాడూ భర్తని తప్ప మరో మగవాడిని కన్నెత్తి చూసింది లేదు. అలాంటి ఉన్నతమైన స్త్రీని మనం ఎక్కడా చూడలేం సూర్యం. చాలామంది మామూలుగా ఉంటారు కానీ ఆ ప్రత్యేకమైన వ్యక్తిత్వం చాలా అరుదు. ఏ ఇంటికి వెళ్ళాలన్నా భయపడేది భర్త పోయాక ఆమె జీవితం దుర్భరమై పోయింది. మగవాళ్ళు కోరచూపులతో వెంటాడితే ఆడవాళ్ళు తమకేదో అన్యాయం జరిగిపోతోందని భావించుకుని ఆమెను శత్రువుకన్నా హీనంగా పరిగణించి చూపులతోనే చిత్రహింసలు పెట్టేవారు గత్యంతరం లేని పరిస్థితిలో వెంకట్రామ నాయుడిని అంగీకరించింది ఎందుకు తన జీవితం కరగిపోయినా పిల్లలకింత తిండి ఆసరా దొరుకుతాయి. తనేమైనా ఫరవాలేదన్న నిశ్చయానికి వచ్చింది. నాయుడి భార్య రోగిష్టిది. ఆవిడ ఇదివరకే మొగుణ్ణి రెండో పెళ్ళి చేసుకొమ్మని పోరు పెట్టింది. పిల్లలు లేని నాయుడికి అరుంధతి నదీ సముద్రంలో కొట్టుకు పోతున్న వాడికి నావలా కనబడింది. ఆమె పిల్లల్ని పెంచి పెద్ద చేసే భారం తనపై వేసుకున్నాడు. ఆమె కేలోటు రాకుండా చూస్తున్నాడు.

"సూర్యం వాళ్ళు కేవలం వ్యామోహంతో శారీరకమైన కోర్కెలతో దగ్గర కాలేదు. ఒకరి నుండి మరొకరికి ఓదార్పు స్వాంతన లభించాయి. బ్రతకడానికి అరుంధతికి ఓ నీడ దొరికింది. భవిష్యత్తు మీద అతనికో ఆలంబన చిక్కింది. ఇద్దరూ వేదనతో వేసారి పోతున్న తమ జీవితాలకు ఓ అర్థం కల్పించు కున్నారు. సునిశిత మైన ఈ విషయాన్ని సహృదయతతో ఎవరు అవగాహన చేసుకుంటారు. వాళ్ళు నీచులు అని తేలికగా ముద్ర వేసి వెలివేస్తారు తప్ప సవ్యంగా ఆలోచించిన వారేరి.

అరుంధతి పడిన కష్టాలు కళ్ళారా చూశాను కనుక నిజానిజాలు నాకు తెలుసు" ఆవేశంతో కృష్ణమూర్తి కళ్ళు చెమ్మగిల్లాయి.

చిత్తరువులా కూర్చుని వింటున్నాడు సూర్యం. అతని కళ్ళ ముందు తెరలేవో కరగి పోతున్నాయి. ఒక మాతృమూర్తి మహోన్నత రూపం కళ్ళముందు సాక్షాత్కరించ సాగింది.

"ఇంకో మాట సూర్యం. అరుంధతి పై అంతరాంతరాల్లో నాకెందుకింత శ్రద్ధ నీకు నచ్చచెప్పి ఆమె అంటే ఉన్నదురభిప్రాయం తొలగించాలని నేనెందుకింత తపన పడుతున్నానో చెప్పమంటావా."

కృష్ణమూర్తి కళ్ళలో నీటి పొరలు కదిలాయి.

"ఆమెను చిన్నప్పట్నుంచి విపరీతంగా అభిమానించాను. అంతకు మించి ఆరాధించాను. ఆమెను జీవిత భాగస్వామినిగా చేసుకోవాలని ఎంతో ఉవ్విళ్ళూరాను. కానీ నా చదువు పూర్తయి ఉద్యోగంలో స్థిరపడే సరికి ఆమె మరొకరి స్వంతమై పోయింది. ఆదెబ్బ నుండి ఓ పట్టాన కోలుకో లేకపోయాను. భర్త పోయి పిల్లలతో అరుంధతి అవస్థ పడుతుంటే చేతనైన సాయం చేయాలని నా మనసు కొట్టుకు పోయేది. కానీ లోకానికి దడిసి ఆగిపోయాను."

అతని గొంతు వణికింది. సూర్యం ఆర్ద్రంగా స్నేహితుని చేయి నొక్కాడు.

కృష్ణా నువ్వింత వివరంగా చెబితే గాని నా కళ్ళ పొరలు విచ్చుకోలేదు.

పిన్నిపై ఉన్న అపోహలన్నీ చెదరగొట్టి నా మనసును స్వచ్ఛంగా చేశావు. ఇప్పుడు ఆవిడ పాదాలపై పడి క్షమాపణ అడిగినా చేసిన పాపం పోదేమో."

కృష్ణమూర్తి ఎంత బతిమాలినా పిన్నిని కలుసుకోడానికి మొహం చెల్లలేదు సూర్యానికి.

కానీ కృష్ణమూర్తికి చెప్పవలసిందంతా చెప్పి తేలికబడిన గుండెతో రైలెక్కాడు సూర్యం.

ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు.

నాగపూర్ వచ్చిన నాలుగు రోజులకి అతనికో నీలిరంగు కవరొచ్చింది.

కృష్ణమూర్తి వ్రాశాడు.

"సారీ సూర్యం. మీ పిన్నిని నేనెంతో బ్రతిమాలాను. సూర్యం సంతోషంతో వ్రాసిస్తున్నాడు వాళ్ళ తమ్ముడికి చెల్లెలికి తన పొలాన్ని అని నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించాను. కానీ ఆవిడ ఒప్పుకోలేదు. అయాచితంగా వచ్చింది తీసుకోవడం తనకిష్టం లేదంది. ఆ అభిమానధనం ఆవిడ వ్యక్తిత్వానికి మరో కలికి తురాయి కదూ కృష్ణమూర్తి." □